

మరణించినా.. చిరంజీవిగా నిలిచాడు పర్లాఖెముండికి పట్టణానికి చెందిన నరేష్ పట్నాయక్, తన అవయవాలు అతడి కుటుంబ సభ్యులు దానం చేసేందుకు అంగీకరించడంతో పలువురికి పునర్జన్మను ప్రసాదించి చిరస్మరణీయుడిగా, అందరికీ ఆదర్శప్రాయుడిగా మారాడు.

–న్యూస్‌టుడే, పర్లాఖెముండి

మరణించినా.. జీవించాడు

నరేష్ (పాతచిత్రం)

పర్లాఖెముండి యువకుడి బ్రెయిన్‌డెడ్


అయిదుగురికి అవయవ దానం

గజపతి జిల్లా పర్లాఖెముండి పట్టణంలో పాత కోర్టు కూడలి ప్రాంతంలోని తెల్లిగౌడవీధికి చెందిన నరేష్ పట్నాయక్(34) బుధవారం ఉదయం అధిక రక్తపోటుతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య బృందం రెండు రోజులపాటు శ్రమించినా.. చికిత్సకు స్పందించకపోవడంతో గురువారం బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. ఆ తర్వాత అవయవదానంపై వైద్య బృందం వారి కుటుంబ సభ్యులు, బంధువులకు అవగాహన కల్పించారు. అవయవదానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకారం తెలపడంతో ఈ విషయాన్ని జీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డా. కె. రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన నరేష్‌పట్నాయక్ శరీరంలో పనిచేస్తున్న ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు, లివర్ అవయవాలను సేకరించేందుకు అనుమతి జారీ చేశారు. సేకరించిన అవయవాలను జీవన్‌దాన్ ప్రోటోకాల్ ప్రకారం ఐదుగురికి కేటాయించారు. ఆవేదనలోనూ ఔదార్యం చాటుకున్న కుటుంబ సభ్యులను అభినందించారు. విజయవంతంగా అవయవాలను తరలించిన వైద్య బృందానికి, గ్రీన్ ఛానల్ ద్వారా సహకరించిన నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నరేష్ చనిపోతూ మరో ఐదుగురు జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కొద్ది నెలల కిందటే భర్త చనిపోయిన బాధలో ఉన్న నరేష్ తల్లి.. ఇప్పుడు కుమారుడు కూడా దూరమవడంతో గుండెలవిసేలా రోదించింది. సాయంత్రం పర్లాఖెముండి పట్టణానికి చేరుకున్న మృతదేహానికి యువత ఘన నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కారాలు నిర్వహించారు.



చెడుపై.. మంచి సాధించిన విజయమే.
దసరా..! దుర్గమ్మ..
ఈ రోజు మాలో ఉన్న చెడు లక్షణాలను
అంతమొందించే.. అంబికవైరా..!
రాక్షస గుణాలను
రూపుమాపే.. రాజేశ్వరివై రా..!
దురాశను దూరం చేయు..
అహంకారాన్ని అణగదొక్కు..
మా మనసులకు పట్టిన మాలిన్యాన్ని
కడిగి.. మమ్మల్ని కల్ల, కపటం లేని
మనుషులుగా చేయు..
అదే మాకు నిజమైన విజయదశమి

అమ్మను కొలిస్తే ఆనందం



అమ్మవారి పీఠం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: విజయదశమి వేడుకలు జరుపుకొనే విధానంలో ఒక్కో ప్రాంతానిది ఒక్కో శైలి. కొరాపుట్ జిల్లా దమన్‌జోడి సమీపంలో గిరిజనుల కంత బౌసిని ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. నాల్కో టౌన్‌షిప్‌కు సమీపంలో వెదురు చెట్ల మధ్య అమ్మవారి ఆలయం వెలిసింది. దుర్గామాత అవతారంగా భావించి గిరిజనులు పూజిస్తున్నారు. వివాహ, సంతాన యోగంతోపాటు సుఖసంతోషాలు చేకూరుతాయని వారి ప్రగాఢ విశ్వాసం. జిల్లావాసులు సైతం ఇక్కడికి వచ్చి కొలుస్తారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం ఆలయం కిటకిటలాడుతుంది. దూపదీప నైవేద్యాలు, గాజులు, ఎర్రటి వస్త్రాలతో మొక్కులు చెల్లించేవారు కొందరైతే మరి కొంతమంది జంతు బలి ఇవ్వడంతోపాటు తల నీలాలు సమర్పిస్తారు. అక్టోబరులో శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి రోజుకో పద్ధతిలో కైంకర్యాలు నిర్వహించడంతోపాటు అష్టమి రోజున ఇక్కడ వాహనాలకు పూజలు చేస్తారు. దేవీ నవరాత్రులు అత్యంత వైభవంగా జరుపుతారు. శనివారం భారీగా భక్తులు వస్తారని చెప్పిన అర్చకులు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు సుందరంగా తీర్చిదిద్దారు.



ఆలయ ముఖద్వారం

బజార్లు రద్దీ



కొనుగోలుదారులతో సందడిగా గిరి మార్కెట్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దసరా సందడి శుక్రవారం నుంచే మొదలైంది. బ్రహ్మపురలో బజారులన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పూజా, ఇంటి అలంకరణ సామగ్రికి కొనుగోలుకు మొగ్గు చూపారు. శుక్రవారం స్థానిక టాటాబెంజి, సుబ్బారావు కూడలి, పెద్దబజారు, భాపూరు బజారు, గిరిమార్కెట్, పాతబస్టాండు మార్కెట్లలో రద్దీ నెలకొంది.

రెండు రోజులు దసరా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తిథి, వార, నక్షత్రాల ప్రకారం.. ఈ ఏడాది దశమి శనివారం ప్రారంభమై ఆదివారం వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు రెండు రోజుల వేడుకలు జరుపుకోనున్నారు. ఆదివారం రాత్రి ప్రధాన నగరాల్లో రావణ దహనం కార్యక్రమం జరగనుంది. సోమవారం దేవీ విగ్రహాల నిమజ్జనాలు జరుగుతాయి. పోలీసు యంత్రాంగం అన్నిచోట్లా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది.

ఎన్నాళ్లీ.. రక్తధారలు

★ ప్రమాదాలకు నిలయంగా 26వ నంబరు జాతీయరహదారి

★ మూడు నెలల్లో 33 రోడ్డు ప్రమాదాలు



ఘటనా స్థలంలో సారథి మృతదేహం (పాత చిత్రం)



జయపురం సమీపంలో ఛిద్రమైన రోడ్డు



★ రెండు రోజుల క్రితం కొరాపుట్‌కు చెందిన యువకుడు సారథి దాస్ స్కూటీపై మిత్రులతో వెళ్తుండగా సునాబెడ సమీపంలోని జాతీయ రహదారిపై లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సారథి అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. భువనేశ్వర్‌లో ఇంజినీరింగ్ చేస్తున్న సారథి సెలవులకు ఇంటికి వచ్చాడు.

కొరాపుట్ జిల్లాలోని 26వ నంబరు జాతీయ రహదారి నెత్తురోడుతోంది. గోతులు, గుంతలు ఏర్పడి ఎప్పటికప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ దారిలో వెళ్లాలంటేనే వాహనదారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు.

–న్యూస్‌టుడే, సిమిలిగుడ

10 మంది మృతి

రోడ్డు అధ్వానంగా ఉండటంతో మూడు నెలల వ్యవధిలో 33 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 10 దుర్మరణం చెందగా, 37 మందికి గాయాలయ్యాయి. విశాఖ పట్టణం నుంచి రాయ్‌పూర్‌కు వెళ్లే ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. ఒడిశా నుంచి ఆంధ్ర సరిహద్దు సుంకి వరకు రోడ్డును పరిశీలిస్తే ఎక్కడికక్కడ గోతులు కనిపిస్తాయంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అందులో వర్షపు నీరు నిలిచి మరిన్ని ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ఘాట్ రోడ్డు, పొట్టంగి, కుందిలి, సిమిలిగుడ, సునాబెడ, కొరాపుట్, జయపురం, బొరిగుమ్మ, కొట్పాడు, చందిలి ప్రాంతాలకు విస్తరించి ఉన్న రహదారి పూర్తిగా ఛిద్రమైంది. ఆ మార్గం గుండా కొత్తవారు వెళితే.. జాతీయ రహదారా.. గ్రామీణ రోడ్లా అని ఆశ్చర్యం కలగక మానదు.

అధికారుల నిర్లక్ష్యం

రోడ్డు మరమ్మతుల విషయంలో సంబంధిత విభాగ అధికారులు పట్టించుకోవడంలేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభం ముందు రోడ్ల మరమ్మతులు జరిగేవి. ఈ ఏడాది అదీ చేయలేదు. కళ్లెదుటే ప్రజలు ప్రాణాలు పోతున్నా.. జాతీయ రహదారి సంస్థ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

త్వరలోనే మరమ్మతులు

వర్షాల కారణంగా మరమ్మతులు చేయడంలో జాప్యం జరిగింది. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

-కార్యనిర్వాక ఇంజినీర్, సోమజీవా శెరి

ఆందోళన చేస్తాం

జాతీయ రహదారి మరమ్మతులు జరగని పక్షంలో భారీ ఆందోళన చేస్తాం. ఇంకెన్ని ప్రాణాలు తీస్తారు. వినతులు ఇస్తున్నా.. అధికారులు స్పందించడం లేదు.

- సంతోష్ కుమార్ దాస్, సిమిలిగుడ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు

వన్యప్రాణులను చూసొద్దాం రండి



పర్యాటక వాహనాలను అనుమతిస్తున్న అటవీ అధికారులు

4 నెలల తరువాత తెరుచుకున్న సిమిలిపాల్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే

సిమిలిపాల్ అభయారణ్యంలో మళ్లీ పర్యాటకుల సందడి మొదలైంది. నాలుగు నెలల విరామం తరువాత గురువారం శీతాకాలం ప్రవేశం పేరిట తలుపులు తెరిచారు. రుతుపవనాల నేపథ్యంలో జూన్ 12న దీనిని మూసేసిన అటవీశాఖ మళ్లీ గురువారం నుంచి అనుమతించారు. ఈ విషయమై సిమిలిపాల్ ఉప సంచాలకుడు సామ్రాట్‌గౌడ్ మాట్లాడుతూ.. తొలిరోజు 36 వాహనాల్లో 151 మంది పర్యాటకులు సందర్శించినట్లు చెప్పారు. వన్యప్రాణులను దగ్గర నుంచి చూసేందుకు రక్షణగా సఫారీ వాహనాలకు అవకాశం కల్పించినట్లు గౌడ పేర్కొన్నారు. ఇందు కోసం పర్యాటకులు ముందుగానే వాహనాలు బుక్ చేసుకోవాలని వెల్లడించారు. సఫారీ వాహన సేవలు ఉదయం 5.30 నుంచి 5 గంటల పాటు మధ్యాహ్నం 3 నుంచి నాలుగు గంటల పాటు సమకూర్చుతున్నట్లు గౌడ స్పష్టం చేశారు. కలియాని ప్రవేశ మార్గం ద్వారా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు, పిఠాబట మార్గం మీదుగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పర్యాటకుల ప్రవేశానికి అనుమతి కల్పిస్తున్నట్లు సామ్రాట్ వెల్లడించారు.

వివిధ రకాల జాతులకు నిలయం

2,750 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉన్న సిమిలిపాల్ ఎన్నో రకాల జీవరాశులకు నిలయంగా ఉన్నట్లు అటవీశాఖ వర్గాలు తెలిపాయి. రాయల్‌బెంగాల్ పులులు, చిరుతలు, ఏనుగులు, చారల జింకలు, 242 రకాల పక్షి జాతులు, 42 రకాల క్షీరదాలు, 30 రకాల సరీసృపాలు, ఇతరత్రా వన్యప్రాణులు ఇక్కడ కనువిందు చేస్తాయి. వీటితో పాటు ఎన్నోరకాల వృక్షజాతులు పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంటాయి. ఉద్యానవనంలో ఏ కారణంతోనైనా పర్యాటకుల కార్లు మరమ్మతులకు గురైతే సిమిలిపాల్ నిర్వాహకులు సమకూర్చే ప్రత్యామ్నాయ వాహనానికి రూ.4 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

స్తంభించిన రాకపోకలు

నందపూర్ సమితిలో పాడువా సమీపంలో బంజలపుట్ వంతెన వద్ద శుక్రవారం ఉదయం ఒక లారీ రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బంజలపుట్ వంతెన వద్దకు వచ్చేసరికి లారీ మరమ్మతులకు గురై ఆగిపోయింది. బ్రిడ్జి దారి ఇరుకుగా ఉండటంతో వేరే వాహనాలు వెళ్లేందుకు మార్గం లేకుండా పోయింది. దీంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనదారులు, పోలీసులు శ్రమించి వాహనాన్ని పక్కకు తొలగించడంతో రాకపోకలు యధావిధిగా జరిగాయి.

–న్యూస్‌టుడే, సిమిలిగుడ



సిమిలిగుడలో నీటి మీటర్ల దొంగలు



నెహ్రూనగర్‌లో చోరీకి గురైన మీటరు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ పట్టణంలో గత కొద్దిరోజులుగా నీటి మీటర్ల చోరీ చర్చనీయాంశంగా మారింది. నీటి వినియోగాన్ని కొలిచేందుకు కుళాయిలకు అమర్చిన మీటర్లను ఎత్తుకెళ్తున్నారు. గతంలో కైలాష్ నగర్, ఓసీసీ నగర్‌లో మీటర్ల చోరీ జరిగిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం రాత్రి గాంధీ, నెహ్రూనగర్‌లో దొంగతనం జరిగినట్లు వినియోగదారులు తెలిపారు. ఒకే రాత్రి సుమారు 80 వరకు చోరీ జరిగాయని, దీంతో ఇప్పటివరకు 200 మాయమయ్యాయని స్థానికులు వెల్లడించారు. పోలీసులు నిఘా వేయాలని కోరారు.

ఈసీ ఎవరు?

నియామకంపై ప్రభుత్వం కసరత్తు



భువనేశ్వర్‌లోని ఎస్ఈసీ కార్యాలయం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను భాజపా ప్రభుత్వం త్వరలో నియమించనుంది. ఇది వరకు ఉన్న ఆదిత్యపాఢి పదవీ కాలం ఆగస్టు 18తో ముగిసింది. తదుపరి నియామకానికి సంబంధించి ఆరునెలల ముందుగా ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన ముగ్గురి వివరాలు ముఖ్యమంత్రి కార్యాలయానికి(సీఎంఓ) చేరింది. ఇంతలో ఎన్నికల ప్రకటన జారీ కావడంతో ప్రక్రియ నిలిచిపోయింది.

వార్డుల పునర్విభజన

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ బాధ్యతంతా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌దే. 2027లో పంచాయతీ ఎన్నికలు జరిగే సూచనలు ఉన్నాయి. అంతకుముందు వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ విధానం ఖరారు చేయాల్సి ఉంది.

వారికే ప్రాధాన్యత

మార్చిలోనే ముగ్గురిని సిఫార్సు చేసినప్పటికీ వారెవరన్నది ఇంత వరకు తెలియలేదు. తమకు అనుకూలంగా ఉన్నవారికే మోహన్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని అంతా భావిస్తున్నారు.

పరిశీలిస్తున్నాం

న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ మాట్లాడుతూ కీలకమైన పదవి కావడంతో నియామకంపై కసరత్తు జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం భజన పరులకు అవకాశం కల్పించిందన్నారు. మోహన్ సర్కారు ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజాహితమే ధ్యేయమన్నారు.

పరాశక్తి పాహిమాం



కటక్‌లోని కాలేజ్ జంక్షన్ మండపంలో విజయరూపిణి



నీలకంఠనగర్ హౌసింగు బోర్డులోని ఎన్.వి.రామకృష్ణారావు ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



నీలకంఠనగర్ హౌసింగు బోర్డు కాలనీలో ...

ఊరువాడా విజయదశమి ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాలు, మండపాలకు భక్తులు పోటెత్తుతున్నారు. అమ్మవారి అవతారాలను దర్శించుకుని తన్మయత్వం చెందుతున్నారు. బ్రహ్మపుర నీలకంఠ హెచ్‌బీ కాలనీలో శాకాంబరీ అవతారంతో దుర్గమ్మ దర్శనమివ్వగా, అదే కాలనీలో ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. కటక్‌లో కళాశాల జంక్షన్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం చూసిన భక్తులు పరవశంలో మునిగారు.

–బ్రహ్మపుర, భువనేశ్వర్

మండపాల్లో సీఎం మోహన్, నవీన్ పట్నాయక్ పూజలు



మోహన్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న పూజా సంఘం ప్రతినిధులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి శుక్రవారం భువనేశ్వర్‌లో దుర్గమ్మ మండపాలను సందర్శించారు. శనివారం కటక్ వేడుకల్లో పాల్గొని అనంతరం ఆదివారం సొంత జిల్లా కేంఝర్‌లో పర్యటించనున్నారు. మండపాలకు సంబంధించి జిల్లా యంత్రాంగాలు, నగర, పురపాలక సంఘాలు వసూలు చేస్తున్న పన్నులు ఈ ఏడాది మినహాయించిన విషయం తెలిసిందే.

నవీన్ సందర్శన: ఉత్సవాలు, వేడుకలకు దూరంగా ఉండే విపక్షనేత నవీన్‌పట్నాయక్ శుక్రవారం భువనేశ్వర్‌లోని దేవి మండపాన్ని సందర్శించి పూజలు చేశారు.



భువనేశ్వర్ బర్ముండ మండపంలోని పూజలో పాల్గొన్న నవీన్ పట్నాయక్

గౌరమ్మ.. దీవించమ్మా


బ్రహ్మపుర: ఛత్రపురంలోని మా రామాయణమ్మ ఆలయంలో..


పర్లాఖెముండి: పూజలు అందుకుంటున్న కంచి కామాక్షి



భువనేశ్వర్: ఆది పరాశక్తిరూపంలో అమ్మవారు..


ఖరగ్‌పూర్‌లో..


పట్టణాల్లో విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. చిన్నాపెద్ద అంతా భక్తిశ్రద్ధలతో జగదాంబను పూజిస్తున్నారు. వివిధ రకాల పుష్పాలతో దేవిని అలంకరించి నైవేద్యాలు సమర్పిస్తున్నారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసి కరుణించాలని పరమేశ్వరిని వేడుకుంటున్నారు. విద్యుత్కాంతులతో మండపాలు ఆకర్షణీయంగా మారాయి. ఈ సందర్భంగా నిర్వహించిన దాండియా, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


బ్రహ్మపుర: ఖస్పావీధిలోని కళాకారుల నృత్యాలు


రాయగడ: ఎస్బీఐ కూడలి వద్ద..


జయపురంలో..


భువనేశ్వర్: రసూల్‌గఢ్‌లో ఆకట్టుకుంటున్న మండపం


గుణుపుర: బవురి వీధిలో జగన్నాథ ఆలయ నమూనాతో మండపం


బ్రహ్మపుర: డొళువా వీధిలో కాళీమణి రెసిడెన్సీలోని ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

ఘనంగా 'చౌతొరొ' యాత్ర

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కలహండి జిల్లా కేంద్రం భవానీపాట్నాలో సుప్రసిద్ధ మాణికేశ్వరి అమ్మవారి 'చౌతొరొ' యాత్ర శుక్రవారం ఘనంగా జరిగింది. భవానీపాట్నా రాజవంశీయుల సమక్షంలో ఏర్పాటైన వేడుకల్లో 10 వేల పశువులకు బలి ఇచ్చారు. మూగప్రాణుల నెత్తురు వరదలా పారింది



మహిషాసురమర్దినిగా భగవతి

జయపురం ప్రజల ఆరాధ్య దేవత భగవతి అమ్మవారికి గురువారం రాత్రి బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. తిరువీధుల్లో ఊరేగించారు. - న్యూస్‌టుడే,జయపురం


పాలనాధికారి, పక్కన రాయిబారి, చంద్రసాగరియా

విజయదశమి వేడుకలకు రండి

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్రా ఆదివాసీ మహిళా సంఘ అధ్యక్షురాలు రాయిబారి శాంటా శుక్రవారం పాలనాధికారి కీర్తి వాసన్‌ను దసరా ఉత్సవాలకు ఆహ్వానించారు. సంఘ సలహాదారుడు చంద్రసాగరియా, సావిత్రి దురువా ఆయన వెంట ఉన్నారు.

నిర్లక్ష్యం.. నిరుపయోగం



చిన్నారుల కోసం నిర్మించిన పార్కు నిరుపయోగంగా మారింది. పనికిరాని మొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. గోపాల్‌పూర్ ఎన్‌ఏసీ రెండేళ్ల క్రితం 5వ వార్డులో రూ.18 లక్షలు నిధులతో నిర్మించింది. పనులు తుది దశకు చేరుకున్న తరుణంలో ఆగిపోవడంతో ప్రారంభించకుండానే పనికిరాకుండా పోయింది. ఎన్‌ఏసీ ఈవో మానస్‌రంజన్ మల్లిక్ వద్ద ప్రస్తావించగా తొలి విడత విడుదలైన నిధులతో పనులు జరిగాయని, తరువాత నిధులు రాక అసంపూర్తిగా మిగిలిందన్నారు. పట్టణాభివృద్ధి శాఖ యంత్రాంగానికి తెలియజేసి త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. - గోపాలపూర్, న్యూస్‌టుడే


ఔషధ దుకాణం వద్ద వేచి ఉన్న రోగులు

ఉచిత మందులకు తప్పని పాట్లు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: అవిభక్త కొరాపుట్‌లో నాలుగు జిల్లాలకు ముఖ్య ఆధారమైన లక్ష్మణ్‌నాయక్ వైద్యకళాశాలలో సేవలు తీసికట్టుగా మారాయి. చికిత్సకు వచ్చే రోగులు ఓపీ కోసం గంటల కొద్దీ వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. పరీక్షల అనంతరం మందులకు నిర్మయ కేంద్రం (మందుల వితరణ కేంద్రం) వద్ద ఎక్కువ సమయం ఉండే పరిస్థితి. ఒక్క కేంద్రం ఉండడంతో ఈ అవస్థలు తప్పడం లేదు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

నందపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితిలో పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్రకడమ్ పర్యటించారు. నందపూర్, పాడువాల్లో మండపాల వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలు పరిరక్షించాలని పోలీసులకు సూచించారు. ఆయనతో సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు కామేష్ తదితర నేతలు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులతో రామ్‌చంద్రకడమ్

మాజీ ఎమ్మెల్యే నిరంజన్ కన్నుమూత

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పొలసర మాజీ ఎమ్మెల్యే **నిరంజన్ ప్రధాన్(67)** గురువారం అర్ధరాత్రి భువనేశ్వర్‌లోని ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. 2004, 2014 లలో రెండు పర్యాయాలు బిజద తరఫున పొలసర నుంచి పోటీ చేసి శాసనసభకు ఎన్నికయ్యారు. నిరంజన్ మృతిపట్ల ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, బిజద అధినేత నవీన్‌పట్నాయక్, ఇతర నాయకులు సంతాపం తెలిపారు.




పత్రికొమ్మలు కొంటున్న మహిళ

దసరా సందడి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా పర్లాఖెముండిలో సందడి నెలకొంది. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పత్రికొమ్మలు, పండ్లు, పూలదండలను కొనుగోలు చేస్తున్నారు. బజారు కూడలి ప్రాంతం రద్దీగా మారింది.

రోడ్డు ప్రమాదంలో పోలీసు మృత్యువాత

భువనేశ్వర్, న్యూస్‌టుడే: జగత్సింగ్‌పూర్ జిల్లా తిర్తోల్ పట్టణ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సూరజ్‌ముండ(48) మృతిచెందాడు. ద్విచక్రవాహనంపై తిర్తోల్ బజారు మీదుగా రాణాపైపుకు వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ప్రయాణికుల బస్సు ఢీకొంది. ఘటనా స్థలంలోనే ఆయన మృతిచెందారు. పోలీసులు వాహనాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మరొక వ్యక్తికి..

రాయగడ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కొళ్నార సమితిలోని టికిరి గ్రామానికి చెందిన సూర్యకాంత్ నాయక్ ఇంటి నుంచి నడుచుకొని వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ట్రాక్టరు అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదం గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జరిగింది. స్థానికులు ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు.

మహానదిలో ఇద్దరు చిన్నారుల గల్లంతు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సంబల్‌పూర్ తివారీసాహి పరిధిలోని మహానది సడక్ ఘాట్‌లో శుక్రవారం సాయంత్రం స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థులు మునిగిపోయారు. వారి ఆచూకీ కోసం అగ్నిమాపక సిబ్బంది చీకటిపడిన వరకు గాలించారు. ఆచూకీ దొరకకపోవడంతో శనివారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపడతామని అగ్నిమాపక అధికారి ఎస్.కె.దాస్ విలేకర్లకు చెప్పారు. గల్లంతైన విద్యార్థుల పేర్లు హిమాంశు, కనిష్కలుగా తెలిసింది.

152 లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి ఠాణా పరిధిలో తనిఖీలు చేసిన పోలీసులు శుక్రవారం ఓ కారులో 152 లీటర్ల నకిలీ విదేశీ మద్యం గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకుల్ని అదుపులోకి తీసుకున్నామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ తెలిపారు. నిందితులు కె.నువాగాం ఠాణా పరిధిలోని దెఖాలి గ్రామానికి చెందినవారని వెల్లడించారు.

కారు బోల్తా.. ఐదుగురికి గాయాలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: దసరా సెలవులు పూరిని సందర్శించేందుకు వచ్చిన ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పర్యాటకులు శుక్రవారం కారులో పురి నుంచి గోపాల్‌పూర్ వెళ్తుండగా ఆస్రంగ్ పరిధిలోని జహనియా వద్ద కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు ఆసుపత్రిలో చేర్చారు.

జూదరుల అరెస్టు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ కొత్త బీడు(నువపాడ)లో జూద కేంద్రంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. నిందితులు ఐదుగురిని అదుపులో తీసుకుని రూ.16 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ కమలకాంత్ కర్షర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రహదారి ప్రమాదంలో ఆవులు మృతి

జయపురం, పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని తేలిగూడ ప్రాంతంలో జాతీయ రహదారి 26 పై జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ఆవులు మృతి చెందాయి. ఐఐసీ ఈశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి రహదారిపై ఇవి నిద్రిస్తుండగా అతి వేగంగా వచ్చిన ట్రక్కు వీటిని ఢీకొనడంతో ఘటనా స్థలంలో మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు వీటి కళేబరాలను సమీప అడవిలో పాతిపెట్టారు. ట్రక్కు చోదకుడు, సహాయకుడు పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

58 యూనిట్ల రక్తం సేకరణ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి ఉప్పలాడలోని వికాస్ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం హెల్ప్ ఎవర్ హర్ట్ నెవర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. భవిష్యత్‌లో మరెన్నో శిబిరాలు నిర్వహించి రక్త కొరతను తగ్గించేందుకు తమవంతు కృషి చేస్తామని 'న్యూస్‌టుడే'కి తెలిపారు. 58 యూనిట్ల రక్తం సేకరించినట్లు రక్తనిధి ఉద్యోగి ఖగేశ్వర్‌బెహరా తెలిపారు. వైద్యాధికారి ఎం.ఎం. ఆలీ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

నాడు అధ్వానం.. నేడు సుందరం



ఒకప్పుడు ఇక్కడ బీఈఎంసీ చెత్త డంపింగ్ పాయింట్ ఉండేది. గాంధీనగర్, బెజ్జిపురం ప్రాంతాల్లో పోగుచేసిన చెత్తచెదారాలు వేసేవారు. బీఈఎంసీ అధికారులు డంపింగ్ పాయింట్ తొలగించి సుందరంగా మార్చింది. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఇక్కడ గోడలపై చిత్రాలు వేయడంతోపాటు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు.
– న్యూస్‌టుడే, బ్రహ్మపుర బజారు

రతన్‌టాటాకు ఘన నివాళి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి ఉప్పలాడ పంచాయతీ రాసూరు గ్రామం యువకులు పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా మృతికి ఘన నివాళిలర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. టాటా ట్రస్టు ఉద్యోగి ఎం.జగన్నాథరాజు, ఎం.శివాజీరాజు, ఎం.కృష్ణారావు ఉన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



ఘనంగా నవమి పూజలు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం కొరాపుట్‌లో నవమి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మహిషాసురమర్దిని అవతారంలో కొలువదీరిన దుర్గా సమేత దేవతామూర్తులను ప్రత్యేక పూజలు చేసి హోమాలు నిర్వహించారు. దీంతో పాటు బొమ్మల కొలువు ఆకర్షణీయంగా నిలిచింది. దాండియా నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పోలీసుల నిఘా!

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రోత్సవాల నేపథ్యంలో దక్షిణ ఒడిశాలోని ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బ్రహ్మపురలో సందడి నెలకొంది. నగరంలోని బజార్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక దుర్గాపూజా పెండాళ్లు తిలకించేందుకు నగరవాసులు కుటుంబాలతో తరలివస్తుండటంతో రహదారులన్నీ రద్దీగా ఉంటున్నాయి. దీంతో బ్రహ్మపుర పోలీసు జిల్లా యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై గట్టి నిఘా పెట్టడంతోపాటు చోరీలు, రద్దీలో మహిళల మెడ నుంచి బంగారం గొలుసులు లాక్కుపోయే వారిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. నగరంలోని ప్రధానమైన ఖొడాసింగి, లుచ్చాపడ రోడ్డు, పాత బ్రహ్మపుర, అస్కా రోడ్డు మొదటి గేటు, విజయా టాకీసు, బెజ్జిపురం కూడళ్లలో శుక్రవారం తాత్కాలిక తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా చోట్ల నియమితులైన సిబ్బంది పరిసరాలపై గట్టి నిఘా పెట్టారు.


విజయా టాకీసు కూడలిలో తాత్కాలిక పోలీసు తనిఖీ కేంద్రం వద్ద సిబ్బంది

మండుతున్న కూరగాయల ధరలు

జయపురం, న్యూస్‌టుడే: గత కొన్నిరోజులుగా పెరుగుతున్న కూరగాయల ధరలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొరాపుట్ జిల్లాలో తాజా కూరగాయలు తక్కువ ధరలకు అందుబాటులో ఉండేవి. కానీ స్థానిక రైతులు పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేయడంతో ఇక్కడ గిరాకీ పెరిగింది. వీటిని దృష్టిలో పెట్టుకొని పట్టణంలో భోజన హోటళ్లలో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీంతో ప్రజలు తలలు పెట్టుకుంటున్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

రాయగడ, న్యూస్‌టుడే: పట్టణంలోని రైతుకాలనీలో 40 మంది ఆదివాసీ వృద్ధులకు శుక్రవారం నవజీవన్ ట్రస్టు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు బి.నళిని, ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు డా. శ్రీధర్ ఆచార్య(తిరుపతి) తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందిస్తున్న సభ్యులు

వెయిట్‌లిఫ్టింగ్‌లో హృదాయనందకు పతకాలు



హిమాచల్‌ప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రానికి రెండు పతకాలు వచ్చాయి. గురువారం రాత్రి జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రానికి చెందిన హృదానంద.. జూనియర్ విభాగంలో స్నాచ్‌లో 132 కిలోలు, క్లీన్‌జర్క్‌లలో 170 కిలోలు మొత్తం 302 కిలోలు బరువులెత్తి ఒక పసిడి, ఒక రజత పతకం సాధించాడు.
– న్యూస్‌టుడే, బ్రహ్మపుర క్రీడలు

గోపాల్‌పూర్‌కు పర్యాటకుల తాకిడి

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ పర్యాటక కేంద్రానికి కోల్‌కతా(పశ్చిమబెంగాల్) వాసులు పోటెత్తారు. దసరా సెలవులు కావడంతో ఈ తీర పట్టణ విహారానికి వచ్చారు. హోటళ్లు, అతిథిభవనాలు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు పట్టణ పరిధిలో దేవీ నవరాత్రుల పెండాళ్లు సందర్శకులను నేత్రపర్వం చేస్తున్నాయి. గోపాల్‌పూర్‌కి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉక్కు, గనుల, రవాణా, వాణిజ్య శాఖల మంత్రి బిభూతి భూషణ జెనా పూజా మండపాలు తిలకించారు. మహిషాసురమర్దినికి పూజలు చేశారు.


గోపాలపూర్‌లో అమ్మవారి సన్నిధిలో మంత్రి బిభూతి దీపారాధన


బజారు కూడలి ప్రాంతంలో వాహనదారుల ఇక్కట్లు

తీరని ట్రాఫిక్ సమస్య

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలో గత కొన్నేళ్లుగా ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. పట్టణ ముఖ్య రహదారి బజారు కూడలి ప్రాంతంలో ఇరువైపులా చిరు వ్యాపారుల దుకాణాలు ఉండడంతో సమస్య తీవ్ర రూపం దాల్చింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడి వాహనాలు నిలిచిపోతున్నాయి. పూజల సమయాల్లో మరింత ఎక్కువగా ఉంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదని స్థానికులు అంటున్నారు.

ఇంటింటా సౌరభం..!

సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సామాన్యులకు కరెంట్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా ఇంటి పైకప్పుపై నుంచే విద్యుత్తు ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. దీని ద్వారా కలిగే ప్రయోజనాలపై జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)



గోడప్రతిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఈ ఏడాది ఇప్పటి వరకు ఇచ్చిన కనెక్షన్లు..

డివిజన్	సంఖ్య
శ్రీకాకుళం	50
టెక్కలి	27
పలాస	16
పాలకొండ	2



‘పీఎం సూర్యఘర్’పై విస్తృత ప్రచారం

ఉమ్మడి జిల్లాలో తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) పరిధిలోని శ్రీకాకుళం, టెక్కలి, పలాస, పాలకొండ డివిజన్లలో ఈ ఏడాది ఇప్పటి వరకు 794 ఇంటిపై సౌర ఫలకాల ఏర్పాటుకు వివరాలు నమోదు చేసుకున్నారు. వారిలో 176 మంది రుసుం చెల్లించగా.. 95 మంది అధికారులు కనెక్షన్లు ఇచ్చారు.

గరిష్ఠ రాయితీ రూ.78 వేలు..

వినియోగదారులు www.pmsuryaghar.gov.in/apepdcl వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అందులోనే సౌర ఫలకాలు సరఫరా చేసేవారిని ఎంపిక చేసుకున్నాక యూనిట్ ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత వినియోగదారుడి బ్యాంకు ఖాతాకే రాయితీ జమ అవుతుంది. పథకం ద్వారా కిలోవాట్ నుంచి మూడు కిలోవాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తికి మాత్రమే రాయితీ ఇస్తారు. అంతకు మించి సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటు చేసుకున్నా రూ.78 వేలే సబ్సిడీ వస్తుంది. ఒక ఇంటికి ప్రస్తుతం ఎంత విద్యుత్తు వినియోగిస్తున్నారో ఆ మేరకు యూనిట్ మంజూరు చేస్తారు. కిలోవాట్ సౌర ఫలకాల ఏర్పాటుకు ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం అవసరం.

కిలోవాట్	ఖర్చు (రూ.వేలల్లో..)	రాయితీ
ఒకటి	83	33
రెండు	114	60
మూడు	210	78

అవకాశం వినియోగించుకోండి..

జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్తు బిల్లు ఆదా, కలిగే ఇతర ప్రయోజనాలను వివరిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు మీ పరిధిలోని అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజినీర్(ఏఈ)ను సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలియజేస్తారు. వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం.

– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ, ఈపీడీసీఎల్, శ్రీకాకుళం సర్కిల్

కోటదుర్గ ఆలయానికి బారులు



మహిషాసురమర్దినిగా ఉత్సవ విగ్రహం

పాలకొండ, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా కోటదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం చివరి రోజు కావడంతో వేకువజాము నుంచే బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకులు డి.లక్ష్మీప్రసాద్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉత్సవ విగ్రహం మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చింది. మధ్యాహ్నం జరిగిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ పర్యవేక్షకులు పి.కొండలరావు, సభ్యులు, సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి పర్యవేక్షించారు.



బారికేడ్లలో నిరీక్షిస్తున్న భక్తులు

మన్యంలో పర్యాటకుల సందడి



ఊగే వంతెనపై నడుస్తున్న పర్యాటకులు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మన్యంలో శుక్రవారం పర్యాటకులు సందడి చేశారు. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్కులో సాహస, ఇతర క్రీడలు, బోటింగ్ చేస్తూ ఆనందంగా గడిపారు. మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి జలపాతాలు, ఆడలి వ్యూ పాయింట్, ఇతర పర్యాటక ప్రదేశాలను సందర్శించారు.

టికెట్ ధర పెంచితే చర్యలు



తనిఖీలు చేస్తున్న సిబ్బంది

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు చేపడతామని జిల్లా రవాణా శాఖ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. హైదారాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి పార్వతీపురం, పాలకొండ, సాలూరు వెళ్తున్న ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. అధిక ఛార్జీలు వసూళ్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాపై పటిష్ఠ నిఘా ఉంచినట్లు చెప్పారు. ఏఎంవీలు సత్యనారాయణ, వరప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

300 ఎకరాల కోసం.. 30 మంది కదిలారు..!



పూడిక తొలగిస్తున్న జన్నివలస రైతులు

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలంలోని పెద్దగెడ్డ జలాశయం నుంచి వేల ఎకరాలకు సాగు నీరు వెళ్తుంది. మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని పలు గ్రామాల రైతులకు ఈ నీరే ఆధారం. కానీ కాలువలు అధ్వానంగా ఉండటంతో పూర్తిస్థాయిలో నీరు చేరడం లేదు. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని జన్నివలస శివారు ఆయకట్టు గ్రామం. జలాశయం నీటిని నమ్ముకొని 300 ఎకరాల్లో పంటలు వేశారు. కానీ ప్రవాహం గ్రామానికి వెళ్లక వరి ఎండిపోయే స్థితికి చేరింది. ఏటా ఇదే సమస్యతో నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు. దీంతో చేసేది లేక 30 మంది ఏకమయ్యారు. కాలువ మొదట నుంచి గ్రామం వరకు 12 కిలోమీటర్ల పరిధిలో పూడిక తొలగింపునకు నడుం బిగించారు. శుక్రవారం పాచిపెంట ప్రధాన కాలువ రెండో కిలోమీటరు నుంచి పనులు ప్రారంభించారు. తమ పొలాలకు నీరు వచ్చే వరకు పూడిక తీస్తామని రైతు పి.యోగినాయుడు తదితరులు చెబుతున్నారు.

కృష్ణపల్లిలో కేంద్ర బృందం తనిఖీలు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణపల్లిలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల తీరును కేంద్ర బృందం ప్రతినిధులు ఎం.కె.శశిఅప్పన్, కె.జి.సలీంకుమార్ పరిశీలించారు. ఉపాధి కూలీలు, గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సచివాలయంలో దస్త్రాలను పరిశీలించారు. కొన్నింటి వివరాలు పూర్తిగా లేకపోవడాన్ని గుర్తించి పొందుపర్చాలని సిబ్బందికి సూచించారు. డీఎల్‌డీవో రమేష్‌రామన్, ఎంపీడీవో రూపేష్, ఏపీవో కృష్ణారావు, పీఆర్ డీఈ రత్నకుమార్, ఏఈ చిరంజీవులు, ఏపీవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

చూసొద్దామా.. విజయనగరం వైభవోత్సవం

రాజులు ఏలిన విజయనగరం ఘన చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పేలా రెండు రోజుల పాటు విజయనగరం-2024 ఉత్సవాలకు ఆదివారం శంఖం పూరించనున్నారు.

11 గంటలకు ప్రారంభం

ఆదివారం ఉదయం 8 గంటలకు పైడితల్లి ఆలయం నుంచి అయోధ్య మైదానం వరకు వివిధ కళారూపాలతో ఉత్సవ ర్యాలీ (కార్నివాల్) నిర్వహిస్తారు. 11 గంటలకు అయోధ్య మైదానంలో శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారు.

★ అయోధ్య మైదానంలో రెండింటితో కలుపుకొని ఉత్సవాలను 12 వేదికలపై నిర్వహించనున్నారు.

★ గతం కంటే భిన్నంగా, వైవిధ్యంగా, ప్రత్యేకంగా ఈ ఏడాది కార్యక్రమాలు రూపకల్పన చేశారు. కోట వెనుక భాగంలో పైడిమాంబ చరిత్ర, విజయనగర వైభవాన్ని లేజర్ షో ద్వారా ప్రదర్శించడం ఈ ఏడాది ప్రత్యేకత. రంజని శివరంజినికి ఎదురుగా కోటపై సైతం రెండు రోజుల పాటు లేజర్ షో ఉంటుంది.

★ 14న తొలేళ్లు, 15న సిరిమాను సంబరం. ఈ సందర్భంగా ఉత్సవ శోభ నగరం నలుమూలలా అలరించేలా స్వాగత ద్వారాలను, ప్రభుత్వ భవనాలపై, పార్కుల్లో, ప్రధాన కూడళ్లలో మిరిమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేశారు.

★ అయోధ్య మైదానంలో గతంలో మెగా ఈవెంట్ ఒక్క రోజే జరిగేది. ఈసారి రెండు రోజులు నిర్వహించనున్నారు.



సంగీత, సాంస్కృతిక, సాహిత్య నిలయమైన విజయనగరం ఉత్సవాలకు సిద్ధమైంది. పైడితల్లి సిరిమాను పండగకు అంగరంగ వైభవంగా ముస్తాబవుతోంది. కూటమి ప్రభుత్వం అందలమెక్కిన తర్వాత జిల్లాలో నిర్వహిస్తున్న తొలి వేడుక కావడంతో అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సంప్రదాయం ఉట్టిపడేలా.. సంస్కృతి వెల్లివిరిసేలా.. వైభవాన్ని చాటిచెప్పేలా, విజ్ఞాన వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అలనాటి మధుర స్మృతులు గుర్తుకు తెచ్చేలా నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. – ఈనాడు, విజయనగరం

వేదిక 1 – అయోధ్య మైదానం



★ సాయంత్రం ఆరు గంటల నుంచి పది గంటల వరకు సంగీత విభావరి. ఈటీవీ జబర్దస్త్ కమెడియన్ హైపర్ ఆది స్కిట్లతో పాటు బెంగాల్ బృందంతో నృత్య ప్రదర్శన. సాహితి చాగంటి, సాయిచరణ్, అరుణ్ కౌండిన్య, దామిని భట్ల సంగీత ఆలాపన.

★ రెండో రోజు ఇదే వేదికపై సినీ గాయకుడు కార్తీక్ బృందంతో మెగా మ్యూజికల్ నైట్.

★ ఫుడ్ ఫెస్టివల్, పెట్‌షో. పారా మోటరింగ్.

వేదిక 2 – మహారాజా కోట



★ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సైన్స్ ఫెయిర్, స్టాంపులు, నాణేలు, ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శన.

★ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విజయనగరం చరిత్రను వివరించే లేజర్ షో. ఇక నుంచి దీన్ని ఏడాది పొడవునా కొనసాగిస్తారు.

వేదిక 3 – గురజాడ కళాక్షేత్రం



★ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్థానిక కళాకారులతో నాటికల ప్రదర్శన. విజయనగర ఖ్యాతిని చాటిన వివిధ రంగాల ప్రముఖుల చిత్ర ప్రదర్శన.

వేదిక 4 – విజ్జీ స్టేడియం

★ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, స్కేటింగ్ పోటీలు.



భారీ బందోబస్తు

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆరు జిల్లాల నుంచి రెండు వేల మంది పోలీసులను బందోబస్తుకు రప్పిస్తున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షణకు 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏరియల్ సర్వే, నిఘాకు మూడు డ్రోన్లు వినియోగించనున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించారు.

వేదిక 5 – రాజీవ్ స్టేడియం

★ ఈ నెల 12 నుంచి 16 వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ప్రదర్శన.



వేదిక 6 – ఆనంద గజపతి కళా క్షేత్రం

★ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు.. సంగీత, నృత్య పోటీలు.



వేదిక 7 – ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్

★ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు భువన విజయం, శతాధిక కవి సమ్మేళనం, సాహితీ గోష్ఠి, సంగీత నవ అవధానం.



వేదిక 8 – లయన్స్ కమ్యూనిటీ హాల్

★ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు గిరిజన కళాకారులతో థింసా నృత్యాలు, కోలాటాలు, జానపద నృత్యాలు. విజయనగరం వైభవాన్ని చాటే లఘుచిత్రం ప్రదర్శన.



వేదిక 9 – బొంకుల దిబ్బ



★ సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు కన్యాశుల్కం, సత్య హరిశ్చంద్ర నాటకాల ప్రదర్శన.

వేదిక 10 – కోట

★ దీనికి ఎదురుగా ఉదయం 10 నుంచి సాయంత్రం 7 వరకు పులివేషాల ప్రదర్శన.



వేదిక 11 – మాన్సాస్ మైదానం (లోవర్ ట్యాంక్ బండ్ రోడ్)

★ ఈ నెల 10 నుంచి 20 వరకు జాతీయ స్థాయి సరస్ మేళా (చేనేత, హస్తకళల తయారీ ఉత్పత్తుల ప్రదర్శన).

★ 13, 14 తేదీల్లో రాత్రి పది గంటల వరకు పుష్ప, ఫల ప్రదర్శన.



పత్తి రైతుకు విక్రయ పాట్లు

కూటమి ప్రభుత్వంపైనే పత్తి రైతుల ఆశలు

భామిని, న్యూస్‌టుడే

తెల్ల బంగారంగా ప్రసిద్ధిగాంచిన పత్తి పంట సాగు చేస్తున్న రైతులకు గత ప్రభుత్వం ప్రోత్సాహం అందించలేదు. భామిని మండలంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారు. సుమారు 2,165 ఎకరాల పంట ఈ-క్రాప్‌లో నమోదు అయ్యింది. కొండపోడులో మరో 3000 ఎకరాల్లో పత్తి సాగు చేపడుతున్నారు.

15 వేలు ఎకరాల్లో సాగు..

ఉమ్మడి జిల్లాలోని కొత్తూరు, పాచిపెంట, సాలూరు, జీఎల్‌పురం, సీతంపేట మండలాల్లో 15 వేలు ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఏటా పంట విస్తీర్ణం పెరుగుతోంది. . కానీ, నిల్వ చేసేందుకు కొనుగోలు కేంద్రాలు లేకుండా పోయాయి. దీంతో అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి తక్కువ ధరకే దళారుల చేత పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది క్వింటాకు ధర రూ.7,100 పలికింది. దీంతో పెట్టుబడి కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా చర్యలు లేవు.



లారీలో పత్తిని ఎక్కిస్తున్న కూలీలు (పాత చిత్రం)

రాజాంలో కొనుగోలు కేంద్రం..

గతంలో రాజాంలో పత్తి కొనుగోలు కేంద్రం ఉంది. జిల్లాలో అత్యధికంగా పండించే భామిని మండల రైతులు ఇక్కడికి వ్యయప్రయాసలు పడి పంటను తీసుకొచ్చేవారు. కానీ, కొంత మంది దళారులతో చేతులు కలిపి తీసుకొచ్చిన పంటలో తేమ శాతం అధికంగా ఉందని, నాణ్యత లేదని తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఎక్కడా నిల్వ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో పంటకు గిట్టుబాటు ధర రాకపోగా రవాణా ఖర్చులు పెరగడంతో దళారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.

కేంద్రాలు లేక నష్టపోతున్నాం...



ఏళ్లుగా పత్తిసాగు చేపడుతున్నాను. పంటను నిల్వ చేయడానికి స్థలం లేదు. దీంతో వర్షానికి తడిసిపోతే నష్టపోవాల్సి వస్తోంది. భామినిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– జి.లక్ష్మీపతినాయుడు, పత్తి రైతు, భామిని

ఆదేశాలు రావాల్సి ఉంది

ఏటా అక్టోబరు ఆఖరి వారంలో రాజాంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం. రైతులకు అందుబాటులో ఉండేలా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. మరోసారి జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్తామన్నాం.

– కె. సింహాచలం, మండల వ్యవసాయాధికారి, భామిని

బాలికలకు నాణ్యమైన విద్యే లక్ష్యం

భామిని, పార్వతీపురం, న్యూస్‌టుడే: బాలికల సాధికారతకు లింగ సమానత్వం కీలకమని హోలీక్రాస్ సంస్థ డైరెక్టర్ కె.ప్రభుదాస్ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా భామినిలో శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థతో బాలికలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. చిన్నారులందరికీ నాణ్యమైన విద్య, గౌరవప్రదమైన జీవితం లభించేలా చూడాలన్నారు. ● బాలికల సంరక్షణ, సంక్షేమ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ గిరిజన మందిరంలో శుక్రవారం బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆడ పిల్లలను ఉన్నతంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. వారిని చదివించి ఉన్నత స్థాయికి చేర్చేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ కోరారు. మహిళా సంక్షేమ, సాధికారిత జిల్లా అధికారిణి ఎంఎన్.రాణి, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, ఐసీడీఎస్ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.



విజయసంకేతం చూపుతున్న బాలికలు, మహిళలు

ఏనుగుల రాకతో పంటలు ధ్వంసం



ఏనుగులు ధ్వంసం చేసిన వరి చేను

పార్వతీపురం గ్రామీణం, సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం, పార్వతీపురం మండలాల్లోని తాన్నసీతారాంపురం, పులిగుమ్మి పరిసర ప్రాంతాల్లో ఏనుగులు శుక్రవారం సంచరించాయి. వరి పొలాల్లో తిరుగుతూ పంటను ధ్వంసం చేశాయి. దీంతో నష్టం వచ్చిందని సీతారాంపురం రైతులు టి.రామినాయుడు, టి.శ్రీహరి, వెంకటరమణ, పులిగుమ్మికి చెందిన బి.వెంకటరమణ, సీతమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక రేంజీ అధికారి మణికంఠేష్ బృందం పర్యవేక్షణ చేస్తోందని డీఎఫ్‌వో జీఏపీ ప్రసూన తెలిపారు. నష్టాలను వీఆర్వోలతో కలిసి అంచనా వేస్తున్నట్లు చెప్పారు.